సాక్షి
విశాఖపట్నం

గురువారం । 20 । జూలై । 2023



కేసుల విచారణ వేగవంతం

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో సత్వర పరిష్కారం కోసం విచారణను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. 8లో



52 కేసుల్లో నిందితుడి అరెస్టు

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 52 ఇళ్లల్లో చోరీకి పాల్పడిన నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. 8లో

దంపతుల ఆత్మహత్య



పీఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక సమస్యల కారణంగానే వీరు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. 8లో

10/10

- జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా
- అత్యధిక మెజార్టీతో అన్ని స్థానాలు కైవసం
- మెజార్టీ లేకున్నా పోటీచేసి భంగపడ్డ టీడీపీ



గెలిచిన స్థాయీ సంఘ సభ్యులతో మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఉత్తర, పశ్చిమ సమన్వయకర్తలు కేకే రాజు, ఆడారి ఆనంద్, డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లు




ఓటింగ్‌లో పాల్గొన్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ ఎన్నికల్లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించింది. అన్ని స్థానాలూ కైవసం చేసుకుంది. సంఖ్యా బలం లేకపోయినా నామినేషన్ల పేరిట హడావుడి చేసిన టీడీపీ చివరకు డీలా పడింది. గ్రేటర్‌లో మొత్తం 98 మంది కార్పొరేటర్లకు గాను ఒకరు ఎమ్మెల్సీ (వంశీకృష్ణ శ్రీనివాస్)గా నియమితులు కావడంతో 97 మందే ఉన్నారు. సంఖ్యా బలంగా వైఎస్సార్ సీపీకి 64 మంది (ముగ్గురు స్వతంత్రులు, ముగ్గురు టీడీపీ కార్పొరేటర్ల మద్దతుతో కలిపి), 26 మంది టీడీపీ, ముగ్గురు జనసేన + స్వతంత్ర కార్పొరేటర్, సీపీఎం, సీపీఐ, బీజేపీ నుంచి ఒక్కొక్కరు ఉన్నారు. వీరిలో సీపీఎం, సీపీఐ, జనసేనకు చెందిన ముగ్గురు, స్వతంత్ర కార్పొరేటర్ ఎన్నికకు దూరంగా ఉన్నారు. అనివార్య కారణాల వల్ల వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు ఓటింగ్‌కు రాలేదు. 89 మంది కార్పొరేటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్‌గా మేయర్

స్టాండింగ్ కమిటీకి చైర్‌పర్సన్‌గా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వ్యవహరిస్తారు. జీవీఎంసీ పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు సంబంధించి రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకూ స్టాండింగ్ కమిటీకి పరిపాలన ఆమోదం తెలిపే అధికారం ఉంటుంది. రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్లు వరకూ స్టాండింగ్ కౌన్సిల్ నుంచి కౌన్సిల్‌కు, రూ.2 కోట్లు దాటిన అభివృద్ధి పనులకు సంబంధించి స్టాండింగ్ కమిటీ నుంచి కౌన్సిల్‌కు, అక్కడి నుంచి ప్రభుత్వానికి ఫైల్ వెళ్తుంది. ప్రభుత్వం ఆయా పనులకు పరిపాలన ఆమోదం ఇవ్వాల్సి ఉంటుంది.

సీఎం జగన్ తమకిచ్చిన బలంతోనే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకిచ్చిన బలంతోనే స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించిందని జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల వైఎస్సార్ సీపీ పరిశీలకుడు, మంత్రి అమర్‌నాథ్ తెలిపారు. బలం లేకుండా ఇతర పార్టీల నుంచి ఓట్లు సంపాదించుకోవాలన్నదే చంద్రబాబు దురుద్దేశమని.. అదే ఇక్కడి టీడీపీ నాయకుల్లో కూడా స్పష్టంగా కనిపించిందన్నారు. అయితే కొందరు టీడీపీ కార్పొరేటర్లు జగనన్న పనితీరును మెచ్చి వైఎస్సార్ సీపీకి చెందిన కార్పొరేటర్లకు ఓట్లు వేశారంటే ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. ఎన్నికలకు సహకరించిన ఎమ్మెల్యేలు, మేయర్, నియోజకవర్గ సమన్వయకర్తలు, కార్పొరేటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మంత్రి అమర్‌నాథ్, మేయర్, డిప్యూటీ మేయర్, ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్లు, కేకే రాజు తదితరులు



ఓటింగ్ పూర్తయిన తర్వాత సీలు వేయిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

ఉత్తమ పాలనకు ఈ విజయమే నిదర్శనం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ వై.విసుబ్బారెడ్డి ఆదేశాల మేరకు వరుసగా 3వ సారి విజయం సాధించామని మేయర్ హరి వెంకటకుమారి తెలిపారు. ప్రతిపక్ష పార్టీ కార్పొరేటర్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓటు వేశారంటే అది సీఎం జగన్ పరిపాలన తీరుకు నిదర్శనమన్నారు. ఇదిలా ఉండగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ మహా నగరాన్ని పరిపాలన రాజధానిగా చేసేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తుంటే.. చంద్రబాబు అడ్డుతగలడం సిగ్గు చేటన్నారు.

ఎవరెవరికి ఎన్ని ఓట్లు

వైఎస్సార్ సీపీ	ఓట్లు	ప్రతిపక్ష టీడీపీ	ఓట్లు
ఉరుకూటి నారాయణరావు	66	గోడి విజయలక్ష్మి	24
అక్కరమాని పద్మ	64	నొల్లి నూకరత్న	24
పీలా లక్ష్మీసౌజన్య	64	పిసిని వరహా లక్ష్మీనరసింహ	28
కోడిగుడ్ల పూర్ణిమ	63	పిల్లా మంగమ్మ	25
కంటిపాము కామేశ్వరి	63	బల్ల శ్రీనివాసరావు	28
బల్ల లక్ష్మణరావు	63	బొమ్మిడి రమణ	28
భూపతిరాజు సుజాత	63	మద్దెల రామలక్ష్మి	27
గుడ్ల విజయసాయి	62	ముక్కా శ్రావణి	26
బట్టు సూర్యకుమారి	62	శరగడం రాజశేఖర్	24
చల్లా రజని	61	గంధం శ్రీనివాసరావు	25

బాబు పప్పులుడకలేదు

గెలవలేమని తెలిసినా టీడీపీ అభ్యర్థులను పోటీలో పెట్టిన చంద్రబాబు పప్పులుడకలేదని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం గల చంద్రబాబు ఇప్పటికైనా ప్రభుత్వానికి సహకరించాలని హితవు పలికారు. 2024 ఎన్నికలకు కొన్ని చోట్ల తెలుగుదేశం పార్టీకి అభ్యర్థులే కొరవడే పరిస్థితి ఉందన్నారు.

వచ్చే ఎన్నికలకు ఈ విజయం నాంది..

వచ్చే సార్వత్రిక ఎన్నికలు ఈ విజయం నాందని ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీకి ఉన్న బలం కన్నా అధికంగా ఓట్లు ఓట్లు పోలవ్వడం గమనార్హమన్నారు. ఇది ఒక కుటుంబమని చాటారన్నారు.

భంగపడ్డ టీడీపీ

టీడీపీ మళ్లీ భంగపడింది. జీవీఎంసీలో సంఖ్యా బలం లేనప్పటికీ స్థాయీ సంఘ ఎన్నికల్లో బరిలోకి దిగింది. అధికార వైఎస్సార్ సీపీని దెబ్బతీయాలనో లేదా ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లను కన్ఫ్యూజ్ చేసేందుకో తెలియదు గానీ పది మంది కార్పొరేటర్లను పోటీలో నిలిపింది. చివరకు ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లే వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లేయడంతో ఖంగుతింది. సంఖ్యా బలం చూసుకుంటే అధికార వైఎస్సార్ సీపీకి స్వతంత్రులతో కలిసి 64 మంది కార్పొరేటర్లు ఉన్నారు. కానీ గెలిచిన అభ్యర్థులకు అంతకంటే ఎక్కువ ఓట్లు వచ్చాయి. అంటే టీడీపీ అభ్యర్థులే ఓటేసినట్లు తెలుస్తోంది. ప్రతిపక్ష సీపీఎం, సీపీఐ, జనసేన అభ్యర్థులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు.

ఏఎంసీ మనకు గర్వకారణం



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఏఎంసీ విద్యార్థులు



కేక్ కట్ చేస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ నిర్మల, ప్రస్తుత ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్, డాక్టర్ శశిప్రభ

ఘనంగా ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది కార్యక్రమాలు

మహారాణిపేట: వందేళ్ల చరిత్ర కలిగిన మెడికల్ కాలేజీలో చదువుకున్నందుకు ఎంతో గర్వంగా ఉందని ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. ఏఎంసీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుకున్న కాలేజీకి ప్రిన్సిపాల్‌గా సేవలందించడం తన అదృష్టమన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ మాట్లాడుతూ ఏఎంసీలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉపకులపతి డాక్టర్ రవిరాజ్ మాట్లాడుతూ రూ.40కోట్ల వ్యయంతో సెంటినరీ భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. రిటైర్డు డీఎంఈ డాక్టర్ శశిప్రభ, ఏఎంసీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నిర్మల, సీనియర్ వైద్యులు పెదవీర్రాజు, ఎస్.వి.ఆదినారాయణ, పి.వి.సుధాకర్, ఎస్.కె.అప్పారావు, ఎం.సుబ్బారావు, పి.రామారావు, తదితరులు ప్రసంగించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు ఎం.పార్వతి, వి.మన్మథరావు, జి.రాజేంద్రప్రసాద్, ఉషారాణి నివేదిక అందజేశారు. వైద్య విద్యార్థుల సంఘం నాయకులు డాక్టర్ చెన్నకేశవనాయుడు, శివ సత్య, సందీప్, సోని అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుక జరిపారు. ఏఎంసీ సెంటనరీ ఫౌండేషన్ డే పురస్కరించుకుని ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. వైద్య విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉత్సాహంగా వాక్‌థాన్

బీచ్‌రోడ్డు: ఏఎంసీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీచ్‌రోడ్డులో బుధవారం ఉత్సాహంగా వాక్‌థాన్ జరిగింది. కాళీమాత ఆలయం నుంచి టీయూ 142 యుద్ధ విమాన మ్యూజియం వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను కళాశాల ప్రిన్సిపాల్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్ ప్రారంభించారు. వాక్‌థాన్‌లో కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆర్.కె.బీచ్ వద్ద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వాకర్స్‌కు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు.



థింసా నృత్యం చేస్తున్న విద్యార్థినులు



రంగవల్లులు వేస్తున్న వైద్య విద్యార్థినులు

నేడు, రేపు ఎండోమెంట్ ట్రిబ్యునల్ క్యాంప్ కోర్టు

మహారాణిపేట: ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ కె.వి.ఎల్.హరనాథ్ గురువారం నుంచి రెండు రోజుల పాటు విశాఖలో క్యాంపు కోర్టు నిర్వహిస్తున్నారు. టర్నర్ సత్రం ఆవరణలోని దేవదాయశాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో క్యాంపు కోర్టు జరుగుతుంది. గురువారం యల్లమ్మతోట దేవస్థానం కేసుతోపాటు ఇతర కేసులను విచారిస్తారు. 21న శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలు, సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కేసుల విచారణ ఉంటుందని దేవదాయశాఖ వర్గాలు తెలిపాయి.

కొత్త కొత్తగా ఉన్నదీ..





సీతంపేట: స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌లో భాగంగా సిరిపురం దత్ ఐలాండ్ కూడలిలో పైలట్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేసిన డైనమిక్ అర్బన్ స్పేస్ క్రియేషన్ సెంటర్ తుది దశకు చేరుకుంది. దత్ ఐలాండ్ ఎదురుగా ఖాళీగా ఉన్న రోడ్డుపై రంగురంగుల డిజైన్లతో వేసిన పెయింటింగ్‌లు చూడముచ్చటగా ఉన్నాయి. పాదచారులు సేద తీరేందుకు వీలుగా పాత టైర్లు, డ్రమ్ములు, పాడైన స్కూటర్లను కుర్చీలు, సోఫాలుగా అమర్చారు. చుట్టూ గ్రీనరీ.. మధ్యలో డెకరేటివ్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడంతో దత్ ఐలాండ్‌కు కొత్త అందాలు చేకూరాయి. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం దత్ ఐలాండ్‌ను సందర్శించి.. రీసైకిల్ మెటీరియల్‌తో రూపొందించిన కుర్చీలు, సోఫాలను పరిశీలించారు. విద్యుత్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

గత ప్రభుత్వంలో దుబారా కనిపించలేదా?

- పురందేశ్వరి వ్యాఖ్యలపై మంత్రి అమర్‌నాథ్ స్పందన
- తాము ప్రతి పైసాకు జవాబుదారీగా ఉన్నామని వెల్లడి

మహారాణిపేట: గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులకు లెక్క జమా లేదని, అప్పట్లో జరిగిన దుబారా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి కనిపించలేదా? అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అప్పులపై దర్యాప్తు జరిపిస్తామని, ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ దృష్టికి తీసుకువెళ్లామని పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అనేక కార్యక్రమాలకు రూపకల్పన చేసిందన్నారు. దీనికి అవసరమైన మొత్తాన్ని నిబంధనల మేరకు వివిధ రూపాల్లో సేకరిస్తుందన్నారు. ఈ నిధులను ఎక్కడా దుబారా చేయడం లేదని స్పష్టం చేశారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన అప్పుల గురించి ఆమె ఎందుకు అడగడం లేదని ప్రశ్నించారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి పైసాకు లెక్క చెబుతుందన్నారు. ఆమె నిజాలు తెలుసుకుంటే మంచిదని హితవు పలికారు.

వీఎంఆర్డీఏ ప్రాజెక్ట్‌లు.. పరుగులు

- 4,828 ఎకరాల్లో 'నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు'
- రూ.175 కోట్లతో 83 లేఅవుట్లలో 1,41,654 ప్లాట్ల అభివృద్ధి
- 204.96 ఎకరాల్లో జగనన్న ఎంఐజీ స్మార్ట్‌టౌన్‌షిప్‌లు



మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ రవీంద్ర

దొండపర్తి: పేదలకు సెంటు భూమి అందించే కార్యక్రమం నుంచి నగరాభివృద్ధికి చేపట్టిన అన్ని ప్రాజెక్టులు, మాస్టర్‌ప్లాన్ రహదారుల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర వెల్లడించారు. వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా రూ.175 కోట్లతో 4,828 ఎకరాల్లో 83 లేఅవుట్లు వేసి.. 1,41,654 ప్లాట్లను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ లేఅవుట్లకు భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అందించేందుకు రూ.200 కోట్లతో పనులు చేపట్టినట్లు వెల్లడించారు. జగనన్న ఎంఐజీ స్మార్ట్‌టౌన్‌షిప్‌లో భాగంగా ఆనందపురం మండలం పాలవలస–1, 2లో భాగంగా 76.96 ఎకరాల్లో 446 ప్లాట్లు అభివృద్ధి చేయగా.. తొలి దశలో లాటరీ నిర్వహించి లబ్ధిదారుల ను గుర్తించామన్నారు. రెండో దశ లాటరీ ప్రక్రియ త్వర లోనే చేపడతామన్నారు. విజయనగరంలో 56.11 ఎకరాల్లో, అనకాపల్లి జిల్లాలో 71.89 ఎకరాల్లో లేఅవుట్లు సిద్ధం చేసినట్లు చెప్పారు.

డిసెంబర్ నాటికి మల్టీలెవెల్ కార్ పార్కింగ్ పూర్తి

సిరిపురం జంక్షన్‌లో 1.35 ఎకరాల్లో రూ.80 కోట్ల వ్యయంతో 11 అంతస్తుల్లో చేపట్టిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అండ్ కమర్షియల్ భవనం నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మొదటి అంతస్తు స్లాబ్ పనులు జరుగుతున్నాయని, అవసరమైతే నైట్‌షిఫ్ట్‌లో కూడా పనులు చేపట్టేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

2024 జనవరి నాటికి ఆర్వోబీ

రైల్వే శాఖ నుంచి అనుమతుల్లో జాప్యం కారణంగా ఎన్‌ఏడీ కొత్త రోడ్డు ఫ్లై ఓవర్ వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయన్నారు. త్వరలోనే అనుమతులు వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఇందుకు సంబంధించి రైల్వే శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. అనుమతులు వచ్చిన వెంటనే రూ.28కోట్లతో పనులు చేపట్టి 2024 జనవరి నాటికి పూర్తి చేస్తామని వివరించారు.

శరవేగంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు

మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపట్టిన రహదారుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. బోయపాలెం నుంచి కాపులుప్పాడ వరకు, సీతకొండ నుంచి విశాఖ వ్యాలీ బీచ్ వరకు రోడ్డు విస్తరణ, విజయనగరంలో కేపీ పేట మీదుగా ఆర్ అండ్ బీ అతిథి గృహం నుంచి పాల్ నగర్ జంక్షన్ వరకు, పాయకరావుపేటలో, సబ్బవరం నుంచి గుల్లేపల్లి రోడ్డు పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. ఎండాడ లా కాలేజీ నుంచి పెబెల్ బీచ్ హౌసింగ్ వరకు రోడ్డు, ఫుట్‌పాత్ గ్రీనరీ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు.

నేచురల్ హిస్టరీ పార్క్ డీపీఆర్ సిద్ధం

రూ.88 కోట్లతో నేచురల్ హిస్టరీ పార్కు నిర్మాణం కోసం ఇప్పటికే డీపీఆర్ సిద్ధమైందని జాయింట్ కమిషనర్ తెలిపారు. దీన్ని ప్రభుత్వ అనుమతి కోసం పంపించామని.. ఆమోదం వచ్చిన వెంటనే టెండర్ల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు.

ఎంజీఎం పార్కులో ఓషన్ డెక్‌కు ప్రతిపాదనలు

వీఎంఆర్డీఏ పార్కును ఆనుకుని ఉన్న ఎంజీఎం పార్కు స్థలంలో ఓషన్ డెక్ పేరుతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చీఫ్ ఇంజినీర్ పి.శివప్రసాద్‌రాజు తెలిపారు. ముంబయిలో ఉన్న తరహాలో ఈ ప్రాజెక్టును రూ.7.8కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. లైట్‌హౌస్ వద్ద బీచ్‌కు ఒడ్డున 50 మీటర్లు, సముద్రంలో 50 మీటర్ల మేర రెండు అంతస్తుల్లో హోటల్, వ్యూపాయింట్ నిర్మాణానికి కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి సీఆర్‌జెడ్, ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే ఆరు నెలల్లో ప్రాజెక్టు పూర్తవుతుందన్నారు. కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన దుకాణాలు, ప్లాట్ల బహిరంగ వేలానికి మంచి స్పందన వచ్చిందన్నారు. త్వరలోనే మిగిలిన ప్లాట్లకు కూడా వేలం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

52 చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

- రాజమండ్రి జైల్ నుంచి పీటీ వారెంట్‌పై నిందితుడిని తీసుకువచ్చిన పోలీసులు
- 16 కేసుల్లో 635 గ్రాముల బంగారం చోరీ, 402 గ్రాములు రికవరీ
- నైట్‌బౌట్స్ పేరుతో దారి దోపిడీలు చేస్తున్న గ్యాంగ్ పట్టివేత
- మరో రెండు చోరీ కేసులను ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీసీపీ(క్రైం) నాగన్న


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ(క్రైం) జి.నాగన్న


రికవరీ చేసిన ఆటోలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 52 ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఘరానా దొంగ.. ఇన్‌స్టాగ్రామ్‌లో నైట్ బౌట్స్ ఉన్నాయంటూ మెసేజ్‌లు చేసుకొని మరీ అర్ధరాత్రుళ్లు హైవేలపై దారి దోపిడీకి పాల్పడిన గ్యాంగ్.. ఒక ఆటో చోరీ కేసును దర్యాప్తు చేస్తే 7 ఆటోలు, 2 బైక్‌లు దొంగతనం చేసిన నిందితుడు.. షట్టర్ల తాళాలు పగలగొట్టి మరీ వరుస చోరీలకు పాల్పడిన అన్నదమ్ములు.. ఇలా నగరంలో ఈ నెలలో జరిగిన నాలుగు చోరీలు, దోపిడీలకు సంబంధించిన కేసులను నగర పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో డీసీపీ(క్రైం) జి.నాగన్న ఈ కేసుల వివరాలను వెల్లడించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్

ఇంటికి తాళం వేసి కనిపిస్తే చాలు. ఇంట్లో బంగారం, నగదు మాయమైపోతుంది. ఇంటి యజమానుల నిర్లక్ష్యమే అతడికి వరంగా మారుతోంది. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో 52 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న చెల్లా జాషువా అమిత్‌కుమార్(39) నగరంలో పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో 16 ఇళ్లలో చోరీలకు పాల్పడి 635 గ్రాముల బంగారం ఆభరణాలను దొంగలించాడు. పెందుర్తి ప్రాంతంలో శారదానగర్‌లో ఆకాశపు విజయలక్ష్మి తన కుటుంబంతో కలిసి నివాసముంటున్నారు. ఈ ఏడాది మే 20వ తేదీన ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు వచ్చి చూడగా ఇంట్లో ఉండాల్సిన రూ.2,18,750 విలువ చేసే 8.75 గ్రాముల బంగారు నగదు కనిపించలేదు. దీంతో బాధితురాలు విజయలక్ష్మి పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల మేరకు ఈ చోరీ చేసింది హైదరాబాద్ సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన చెల్లా జాషువా అమిత్‌కుమార్‌గా గుర్తించారు. అయితే పలు చోరీ కేసుల్లో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉన్నట్లు తెలుసుకున్నారు. దీంతో పోలీసులు ఈ నెల 14వ తేదీన పీటీ వారెంట్‌పై జైలు నుంచి తీసుకువచ్చి విచారించగా విశాఖలో 16 చోట్ల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. ఈ చోరీ చేసిన వాటిలో కొంత బంగారాన్ని విక్రయించగా.. మిగిలిన బంగారు నగలను దేవీ జ్యువలర్స్ యజమాని రామచంద్రరావు వద్ద తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. దీంతో పోలీసులు 402 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసి అమిత్‌కుమార్‌ను జ్యుడీషియల్ కస్టడీకి పంపించారు. ఇతడిపై హైదరాబాద్, రాజమండ్రి, విజయవాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో 52 చోరీ కేసులతో పాటు హైదరాబాద్ కుసాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.

నైట్‌బౌట్స్ పేరుతో దారి దోపిడీలు

చదువు మధ్యలో ఆపేసి చెడు అలవాట్లకు బానిసై నైట్‌బౌట్స్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయాలు చేసుకుంటూ దారి దోపిడీలకు పాల్పడే ఏడుగురు గ్యాంగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో నలుగురు మైనర్లు కూడా ఉండడం గమనార్హం. ఈ నెల 16వ తేదీ రాత్రి 12.45 గంటలకు ఎన్‌ఏడీ కొత్త రోడ్డు హెచ్‌పీసీఎల్‌కు వెళుతున్న ట్యాంకర్‌ను ఎయిర్‌పోర్ట్ జంక్షన్ దాటి రెండు కల్వర్టుల మధ్య రెండు బైక్‌ల మీద వచ్చి నలుగురు యువకులు అడ్డుకున్నారు. డ్రైవర్ బండ లింగ స్వామిని రూ.500 ఇవ్వమని డిమాండ్ చేశారు. అతడు ఇవ్వనని చెప్పడంతో ఆ యువకులు కర్రతో లారీపై కొడుతుండగా డ్రైవర్ అడ్డుకోడానికి ప్రయత్నించాడు. దీంతో వారు డ్రైవర్ లింగస్వామిపై కూడా దాడి చేశారు. అతడి వద్ద ఉన్న మొబైల్‌ను రూ.2 వేలు నగదును దోచుకున్నారు. మొబైల్ అయినా ఇవ్వాలని డ్రైవర్ ప్రాధేయపడగా వారు దాన్ని లారీ కేబిన్‌లోకి విసిరేసి బైకులపై షీలానగర్ వైపు వెళ్లిపోయారు. దీంతో డ్రైవర్ లింగస్వామి ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన స్నేహితుడైన మరో డ్రైవర్ నుంచి కూడా ఇలాగే డబ్బులు దోచుకున్నారని అందులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి సీసీ కెమెరాలు ఆధారంగా దోపిడీదారులు కైలాసపురం ప్రాంతానికి చెందిన ఎర్రిపిల్లి సురేష్(19), పోలవరపు లక్ష్మణ్(18), వాసుపల్లి నాగేంద్రకుమార్(18)తో పాటు నలుగురు మైనర్లుగా గుర్తించారు. వారిని బుధవారం ఉదయం 6 గంటలకు అదుపులోకి తీసుకొని విచారించారు. చెడు అలవాట్లకు బానిసై ఇన్‌స్టా గ్రామ్ ద్వారా నైట్‌బౌట్ ఉందంటూ మెసేజ్‌లు చేసుకుంటూ డీఎల్‌బీ గ్రౌండ్‌లో సమావేశమై అందరూ కలిసి మోటార్ సైకిళ్లపై బీచ్ రోడ్డులో తిరుగుతూ, అర్ధరాత్రి సమయాల్లో జాతీయ రహదారులపై కాపుకాసి నెమ్మదిగా వెళ్లే ఇతర రాష్ట్రాల లారీలను అడ్డగించి దోపిడీలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. దీంతో వారి నుంచి రూ.2 వేలు నగదు, ఒక మొబైల్, నేరానికి ఉపయోగించిన 3 బైక్‌లు, వెదురుకర్రను స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేశారు.

9 ఆటోలు, 2 బైక్‌ల చోరీ

ఆటోను చోరీ చేసిన దొంగను పట్టుకుంటే అతడు 7 ఆటోలు, 2 ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు గుర్తించారు. అతడి వద్ద నుంచి రూ.11 లక్షలు విలువ చేసే ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తాటిచెట్లపాలెం ప్రాంతంలో చిట్టిబాబు కాలనీకి చెందిన కొప్పిశెట్టి రమణ ఈ నెల 11న తన ఇంటి ముందు ఆటో పార్క్ చేసి మరుసటి రోజు వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీపీ త్రివిక్రమ్ వర్మ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాని ఏర్పాటు చేశారు. సాంకేతిక సమాచారం మేరకు ఈ నెల 17వ తేదీన దొండపర్తి ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఆటోను చోరీ చేసిన షీలానగర్ ప్రాంతానికి చెందిన ఆళ్ల రాజేష్(23)ను పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఇప్పటి వరకు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 7 ఆటోలు, 2 బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. రాజేష్‌తో పాటు అతడి నుంచి వాహనాలు కొనుగోలు చేసిన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కొండేటి వీరవెంకట సత్యనారాయణ, వెలిగొట్ల వెంకటనారాయణలను పోలీసులు అరెస్టు చేశారు.

అన్నదమ్ములే దొంగలు

గాజువాకలో షాపుల షట్టర్ తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడిన అన్నదమ్ములైన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక బీసీ రోడ్డులో ఈ నెల 16వ తేదీన శ్రీ వెంకటరామ మెడికల్ స్టోర్ షట్టర్ తాళాలు పగలగొట్టి లోపల క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ.6 వేలు నగదును చోరీసినట్లు షాపు యజమాని యండమూరి సత్యనారాయణ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే అదే రోజున ఆ షాపు పక్కన ఉన్న బేకరీ, ఫిష్ అక్వేరియం షాపుల్లో కూడా ఇదే తరహాలో దొంగతనాలు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. గావాజుక, న్యూపోర్ట్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇదే తరహాలో దొంగతనాలు చేసే అన్నదమ్ములు పెదగంట్యాడ దయాల్‌నగర్‌కు చెందిన అశనాల శామ్యూల్(22), అశనాల సురేష్(19)లను అదుపులోకి తీసుకొని విచారించగా వారే ఈ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో వారి నుంచి రూ.6 వేలు నగదును రికవరీ చేశారు. అన్నదమ్ములిద్దరూ పాత నేరస్తులే. శామ్యూల్ మీద గాజువాక, న్యూపోర్ట్ స్టేషన్లలో 12 చోరీ కేసులు, సురేష్ మీద 10 కేసులతో పాటు ఇద్దరిపై న్యూపోర్ట్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఉంది.

దంపతుల ఆత్మహత్య


మంచంపై దంపతుల మృతదేహాలు

పీఎం పాలెం: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్థిక సమస్యల కారణంగానే వీరు బలవన్మరణానికి పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, మృతుల బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ముద్రగళ్ల వెంకట కృష్ణప్రసాద్(54), అతని భార్య రాజరాజేశ్వరి(50) చాలా కాలం క్రితం నగరానికి వలస వచ్చారు. వారికి సంతానం లేదు. కృష్ణప్రసాద్ ప్రస్తుతం ప్యూర్‌పై వాటర్ సరఫరా వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల కొమ్మాది అయ్యప్పనగర్‌లో అద్దెంటికి మారాడు. వీరితోపాటు ఆయన అక్క ఉంటోంది. ఇదిలా ఉండగా వెంకట కృష్ణప్రసాద్ దంపతులు ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తమ గదిలో పడుకున్నారు. బుధవారం ఉదయం వారు ఎంతకీ నిద్ర లేవకపోవడంతో కృష్ణప్రసాద్ అక్క తలుపులు కొట్టింది. అయినా తీయకపోవడంతో రాజమండ్రిలో ఉంటున్న బంధువులకు ఫోన్ చేసింది. వారు ప్రసాద్ వద్ద పనిచేస్తున్న సుమన్ అనే వ్యక్తికి ఫోన్ చేయగా అతడు వచ్చి గది తలుపులు తెరిచి చూడగా మంచంపై విగతజీవులుగా పడి ఉన్నారు. వెంటనే అతడు పోలీసులకు సమాచారం అందించాడు.

ఆర్థిక సమస్యలే కారణమా?

దంపతులు ఆత్యహత్య చేసుకోవడానికి గల కారణాలు పోలీసులు పరిశీలించగా అనేక విషయాలు వెలుగుచేశాయి. నర్సీపట్నంకు చెదిన సుధాకర్ అనే వ్యక్తి స్మార్ట్ విలేజ్ డెవలప్‌మెంట్‌లో ఉద్యోగాలు వేయిస్తానని ఉత్తరాంధ్రకు చెందిన వందలాది నిరుద్యోగుల నుంచి రూ.2 నుంచి రూ.3 లక్షల వరకూ వసూలు చేశాడు. కృష్ణప్రసాద్, రాజరాజేశ్వరి ఈ సంస్థలో పనిచేశారు. ఆ సమయంలో ఈ దంపతులను నమ్మి పలువురు డబ్బులు చెల్లించారు. తరువాత సుధాకర్ పత్తాలేకుండా పోయాడు. తాము ఇచ్చిన సొమ్ము చెల్లించాలని ప్రసాద్‌పై నిరుద్యోగులు ఒత్తిడి తెచ్చారు. ఈ విషయమై రణస్థలం పోలీస్ స్టేషన్‌లో బైండోవర్ కేసు నమోదై ఉంది. తన ప్లాట్లు, ఇళ్లస్థలాలు, వాటర్ ప్లాంట్ తదితర ఆస్తులు అమ్మి 100 మందికి పైగా నిరుద్యోగులకు వారు ఇచ్చిన సొమ్ము చెల్లించాడు. మరికొంతమందికి వచ్చే ఆగస్టు నెలలో చెల్లించేందుకు అంగీకరించాడు. ఒప్పందం ప్రకారం సొమ్ము చెల్లించలేని పరిస్థితి, తీవ్ర మానసిక ఒత్తిడితో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. అతని డైరీ స్వాధీనం చేసుకున్నామని, దీని ఆధారంగా మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు. మృతదేహాలను కేజీహెచ్‌కు తరలించారు. మృతుని మేనల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల విచారణ వేగవంతం

కలెక్టర్ మల్లికార్జున ఆదేశం

సాక్షి, విశాఖపట్నం: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో సత్వర పరిష్కారం కోసం విచారణను వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పోలీస్, రెవెన్యూ అధికారులకు సూచించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులతో ఈ ఏడాది మొదటి, ద్వితీయ, త్రైమాసిక సమావేశం కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ అధికారులతో చర్చించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా చేయడంతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. అప్పుడే కేసుల పరిష్కారంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఇప్పటివరకు 92 కేసుల్లో 88 మంది బాధితులకు రూ.1.15కోట్ల పరిహారం చెల్లించినట్లు వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 95 కేసులు అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉండగా.. 679 కేసులు పెండింగ్ ట్రయల్ దశలో ఉన్నాయని తెలిపారు. అత్యధికంగా కుల ధ్రువీకరణ పత్రాలు పెండింగ్ ఉన్నాయని, వాటిని జారీ చేసే విషయంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు అలసత్వం ప్రదర్శించవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో 2013 నుంచి 2023 వరకు 97 ఎస్సీ, ఎస్టీ కేసులు కేసులు పోలీసు శాఖ విచారణలో ఉన్నాయని, ఈ కేసుల విచారణను సత్వరం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో డివిజనల్ స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశాలు ప్రతి నెలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సివిల్ రైట్స్ డే నిర్వహణ సక్రమంగా లేదని కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డీడీ కె.రామారావు, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, డీసీపీ జి.నాగన్న, ఏసీపీలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి, కమిటీ సభ్యులు పి.మల్లేశ్వరరావు, దాసరి శామ్యూల్, ఎ.రాజబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు 25 వరకు గడువు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో సెల్ఫ్ సపోర్ట్ విభాగంలో ప్రవేశాల దరఖాస్తు గడువు ఈ నెల 25తో ముగియనుందని సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. ఏపీఐసెట్‌లో అర్హత సాధించి.. డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులు, 45 శాతం మార్కులు సాధించిన రిజర్వేషన్ అభ్యర్థులు ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి అర్హులు. ఏపీ ఐసెట్‌లో అర్హత సాధించి బీసీఏ, డిగ్రీలో కంప్యూటర్ సైన్స్ చదివిన వారు ఎంసీఏ కోర్సుకు అర్హులు. డిగ్రీలో 50 శాతం మార్కులు, రిజర్వేషన్ కలిగిన విభాగాల వారు 45 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో నిర్వహించే ఎంబీఏ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో 44 సీట్లు చొప్పున భర్తీ చేస్తారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్‌లో 44 సీట్లు భర్తీ చేస్తారు. ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే ఎంసీఏ(ఫుల్‌టైం) కోర్సులో 50 సీట్లు భర్తీ చేస్తారు. ఎంబీఏ కోర్సుకు ఏడాదికి రూ 1.5 లక్షలు, ఎంసీఏకు ఏడాదికి రూ.1.25 లక్షల ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అర్హత కలిగిన వారు ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలి. పూర్తి చేసిన దరఖాస్తులను పెదవాల్తేరులోని ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అందజేయాలి. ఈ నెల 27న ప్రవేశాల కౌన్సెలింగ్ ఉంటుంది. పూర్తి వివరాలకు www.audoa.inను సందర్శించవచ్చు.

విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

జేఎన్ ఫార్మాసిటీ స్మైలెక్స్ పరిశ్రమలో ఘటన


నాగేశ్వరరావు (ఫైల్)

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలోని స్మైలెక్స్ పరిశ్రమ ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు కార్మికుడు విద్యుత్ షాక్‌తో బుధవారం మృతి చెందాడు. ఈ ప్రమాదంలో అనకాపల్లి మండలం తగరంపూడికి చెందిన నాగులాపల్లి నాగేశ్వరరావు (24) ప్రాణాలు కోల్పోయాడు. పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివీ.. తగరంపూడికి చెందిన నాగేశ్వరరావు స్మైలెక్స్ పరిశ్రమలో కొంత కాలంగా విద్యుత్ పనులు చేస్తున్నాడు. బుధవారం ఉదయం జనరల్ షిఫ్ట్‌కు వచ్చిన ఆయన విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా మధ్యాహ్నం 4 గంటల సమయంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకొన్న యాజమాన్యం ప్రతినిధులు అంబులెన్స్‌లో షీలానగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా నాగేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. రూ.కోటి నష్ట పరిహారం చెల్లించాలని బుధవారం రాత్రి మృతుని కుటుంబ సభ్యులు పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగారు. పరిశ్రమ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ఈశ్వరరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. కాగా, నాగేశ్వరరావు మృతితో తగరంపూడిలో విషాదం నెలకొంది. చేతికి అందొచ్చిన కుమారుడికి వివాహం చేసి శేషజీవితం ప్రశాంతంగా గడుపుదామనుకుంటే దేవుడు తీరని అన్యాయం చేశాడని తల్లిదండ్రులు రమణమ్మ, తాతీలు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వీరికి కుమారుడు నాగేశ్వరరావు, కుమార్తె దేవి సంతానం. కుమార్తెకు ఆరేళ్ల క్రితం వివాహం చేశారు. కుమారుడికి వివాహం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఏడాది క్రితం నూతన గృహాన్ని కూడా నిర్మించారు. ఇంతలో కొడుకు మృతి చెందడంతో ఆ వృద్ధ దంపతులు విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

వైఎస్సార్ సీపీ నేత రవిరెడ్డికి పితృవియోగం


రవిరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి అమర్‌నాథ్



సత్తిరెడ్డి (ఫైల్)

కొమ్మాది: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ గుడిమెట్ల సత్తిరెడ్డి(85) బుధవారం సాగర్‌నగర్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు గుడిమెట్ల మధుకుమార్ లంకపల్లి బుల్లయ్య కళాశాలకు సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. రెండవ కుమారుడు రవిరెడ్డి వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నారు. సత్తిరెడ్డి అప్పట్లోనే కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించి.. సర్టిఫికెట్ కోర్సును అందించారు. బీహెచ్‌పీవీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తించారు. స్టీల్‌ప్లాంట్‌లో జనరల్ మేనేజర్ హోదాలో ఉద్యోగ విరమణ పొందారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, శ్రీ వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు వివేకానందరెడ్డి, నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ బాల మోహన్‌దాస్, వైఎస్సార్ సీపీ నాయకులు చొక్కాకుల వెంకటరావు, జాన్ వెస్లీ, పి.ఎస్.ఎన్ రాజు, ద్రోణంరాజు శ్రీవత్సవ తదితరులు సత్తిరెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు.

'పారదర్శకంగా పీహెచ్‌డీల ప్రక్రియ'

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కల్పన నుంచి సిద్ధాంత గ్రంథాల మూల్యాంకనం వరకు మొత్తం ప్రక్రియ ఎంతో పటిష్టంగా, పారదర్శకంగా జరుగుతుందని ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిశోర్‌బాబు తెలిపారు. వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలు, అవార్డుల జారీ విషయంపై ఏయూ ఆచార్యుడు చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలు వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని, వెంటనే వెనక్కి తీసుకోవాలని ఓ ప్రకటనలో సూచించారు. బాధ్యతాయుతమైన ఆచార్యుడిగా పనిచేస్తూ.. విశ్వవిద్యాలయాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం సర్వీసు నిబంధనలను ఉల్లంఘించడంగా పరిగణిస్తామన్నారు. వర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు ఓ నిర్దిష్ట విధానం, నియమావళి ఉందన్నారు. దీనికి అనుగుణంగా మొత్తం ప్రక్రియ జరుగుతుందనే విషయం గుర్తించాలన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం


చెక్కు అందజేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: డిప్యుటేషన్‌పై విశాఖ సిటీ జీఆర్పీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ బ్రెయిన్‌లో బ్లీడింగ్ కారణంగా మృతి చెందిన ఎ.కేశవరావు కుటుంబానికి 2011 బ్యాచ్ కానిస్టేబుళ్లు ఒక రోజు జీతాన్ని సాయంగా అందజేశారు. 2011 బ్యాచ్‌కు చెందిన కేశవరావు ఈ ఏడాది జూన్ 20న అర్ధరాత్రి రాత్రి విధుల్లో ఉన్న సమయంలో స్పృహ తప్పి పడిపోయారు. సహచరులు వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా జూన్ 26న మరణించారు. కేశవరావుకు 3, 5 ఏళ్ల వయసున్న పిల్లలున్నారు. దీంతో అతని కుటుంబానికి సాయం చేయాలన్న సంకల్పంతో 2011 బ్యాచ్‌కు చెందిన 210 మంది కానిస్టేబుళ్లు ఒక రోజు జీతాన్ని సేకరించారు. వచ్చిన రూ.4.4 లక్షలను బుధవారం సీపీ సీఎం త్రివిక్రమ్ వర్మ చేతుల మీదుగా కేశవరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కేశవరావు కుటుంబానికి రావాల్సిన నగదు, ఇతర భృతి వేగంగా వచ్చేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు.

చెల్లని చెక్ జారీ చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానం న్యాయమూర్తి సోని ద్వారంపూడి తీర్పునిచ్చారు. సీనియర్ న్యాయవాదులు కేవీ రామ్మూర్తి, కె.నరసింహమూర్తి అందించిన వివరాలు.. ద్వారకానగర్ ప్రాంతానికి చెందిన తంగి హరినారాయణకు శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో 11 ఎకరాల భూమి ఉంది. దీనిని అభివృద్ధి చేయడానికి 2006 అక్టోబర్ 25న కిర్లంపూడి లే అవుట్ ప్రాంతానికి చెందిన ఊర్మిళా శర్మతో పాటు మరో ఇద్దరితో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ సమయంలో రూ.1.40 కోట్లు హరినారాయణ అడ్వాన్స్‌గా తీసుకున్నారు. కాగా సంబంధిత భూమి వివాదంలో చిక్కుకోవడంతో తిరిగి నగదు చెల్లించడానికి అంగీకరించాడు. రూ. కోటి చెక్కును 2011 జూన్ 28న ఫిర్యాదుదారు ఊర్మిల పేరు మీద హరినారాయణ జారీ చేశారు. ఆ చెక్కును బ్యాంకు ఖాతాలో జమ చేయగా, తగినంత సొమ్ము లేకపోవడంతో చెక్కు బౌన్స్ అయింది. దీంతో లీగల్ నోటీసు జారీ చేసినా నారాయణరావు బాకీ సొమ్ము తీర్చకపోవడంతో ఊర్మిళాశర్మ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి నేరం రుజువుకావడంతో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించారు.

ఆర్ కార్డు ఎంప్లాయిమెంట్ జాబితా సిద్ధం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నిర్వాసిత ఆర్ కార్డుదారులకు ఒప్పంద నిర్వహణ పనుల్లో నియామకానికి సీనియార్టీ జాబితాను సిద్ధం చేశారు. అన్‌స్కిల్డ్ 100 ఖాళీలు, సెమీస్కిల్డ్ ఫిట్టర్ 25 ఖాళీలు, సెమీస్కిల్డ్ ఎలక్ట్రికల్ 5 ఖాళీలు, సెమీస్కిల్డ్ వెల్డర్ 35 ఖాళీలు, సెమీస్కిల్డ్ ఫ్యాబ్రికేటర్ 5 ఖాళీలతో కూడిన జాబితాను స్టీల్‌ప్లాంట్ హెచ్ డీజీఎం (సీఎల్‌సి)కు పంపారు. గరిష్ట వయోపరిమితి 45 ఏళ్లుగా ఉన్న ఈ జాబితాలో తమ పేరును కార్యాలయంలో పరిశీలించుకోవాలని ఎంప్లాయిమెంట్ అధికారి పి.ఎం.సతీష్‌కుమార్ కోరారు.

రేపటి నుంచి మెగా జాబ్‌మేళా

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21, 22వ తేదీల్లో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఆదేశాల మేరకు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్‌తో కలిసి నిర్వహిస్తున్న జాబ్ మేళాకు 15 వరకూ ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నాయని తెలిపారు. మేళాలో 1000 మంది కెమిస్ట్రీ విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లు ఇవ్వనున్నామన్నారు. ఈ మేరకు హయ్యర్ కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కరరావు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు.

నేడు రాజకీయ పార్టీలతో జిల్లా స్థాయి సమావేశం

సాక్షి, విశాఖపట్నం: ఓటరు సవరణ జాబితా–2023 ప్రక్రియ మొదలుకానున్న నేపథ్యంలో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించనున్నట్లు డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున నేతృత్వంలో ఈ సమావేశం జరగనుందని పేర్కొన్నారు. పార్టీల తరపున బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాని అందించడం, ఇంటింట సర్వేకి వచ్చే బీఎల్వోలకు ఆయా పార్టీల తరఫున సహకారం అందించడం మొదలైన అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

సూపర్ మార్కెట్లలో తనిఖీలు


తనిఖీలు చేస్తున్న తూనికలు, కొలతలు శాఖ అధికారులు

సీతమ్మధార: లీగల్ మెట్రాలజీ కంట్రోలర్ జి.వీరపాండ్యన్ ఆదేశాల మేరకు తూనికలు, కొలతలు శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సంయుక్త నియంత్రకులు జి.రాజేష్‌కుమార్, ఉప నియంత్రకులు బి.మనోహర్, తదితరులు బృందాలుగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పాడేరు జిల్లాల పరిధిలోని కిరాణా, సూపర్ మార్కెట్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో తనిఖీలు చేశారు. దుకాణాల్లో తక్కువ తూకం, అదనపు ధర వసూలు చేయడం, ప్యాకేజీలపై తయారుదారుని చిరునామా, తయా రు తేదీ, ఎంఆర్‌పీ వివరాలు లేకపోవడంతో 30 షాపులపై కేసులు నమోదు చేసినట్లు బి.మనోహర్ తెలిపారు.